సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం • 3 • జనవరి • 2024



అనారోగ్యం'పాలు'

పాడి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన పాలమూరు పేరు కల్తీపాలతో మసకబారింది.

వివరాలు 8లో ▸



రన్నరప్‌గా మహబూబ్‌నగర్

ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఆతిథ్య ఉమ్మడి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.6 /14.3

చలి తీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కుటుంబ సమేతంగా సీఎంను కలిసిన సంపత్



అలంపూర్: ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మంగళవారం హైదరబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కుటుంబ సమేతంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలు అంశాలపై సీఎంతో చర్చించినట్లు సంపత్‌కుమార్ తెలిపారు.

వేరుశనగ @ రూ.7,912

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగ క్వింటా రూ.7,912 ధర పలికింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు 1,524 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌కు తీసుకురాగా, గరిష్ఠంగా రూ.7,912, కనిష్ఠంగా రూ.3,811, సరాసరిగా రూ.5,965 ధరలు వచ్చాయి. 47 క్వింటాళ్ల ఆముదం విక్రయానికి రాగా.. గరిష్ఠంగా రూ.5,459, కనిష్ఠంగా రూ.4,856, సరాసరిగా రూ. 5356 ధర పలికింది. 178 క్వింటాళ్ల సోన ధాన్యం విక్రయానికి రాగా.. గరిష్ఠంగా రూ.3,028, కనిష్ఠంగా రూ.1,951, సరాసరిగా రూ.3,010 ధర పలికింది. 16 క్వింటాళ్ల హంస ధాన్యం విక్రయానికి రాగా.. గరిష్ఠంగా రూ.2,025, కనిష్ఠంగా రూ.1,919, సరాసరిగా రూ.2,025 ధరలు వచ్చాయి.

బాలల హక్కులు కాపాడుదాం



ఎర్రవల్లిచౌరస్తా: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ అన్నారు. ఇటిక్యాల మండలం తిమ్మాపూర్ పాఠశాలలో మంగళవారం బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చదువు ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పాఠశాలలకు పిల్లలను పంపించే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలబాలికలకు ఏదేని సమస్య ఏర్పడితే డయల్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు రాముడు, రవికుమార్ పాల్గొన్నారు.

లక్ష్యం.. వందశాతం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ కసరత్తు



గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు వింటున్న విద్యార్థినులు

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ప్రణాళికా బద్ధంగా విద్యాబోధన
- సబ్జెక్టుల వారీగా పునఃశ్చరణ
- ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి

జెడ్పీ హెచ్‌ఎస్: 84	కేజీబీవీలు: 12
బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాలు: 14	ఎస్‌ఎస్‌సీ పరీక్షలు రాయనున్న విద్యార్థులు: 7,204

పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యాసంవత్సరం ప్రారంభం నాటి నుంచే సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇప్పటికే పరీక్షల నిర్వహణ తేదీ ఖరారు కావడంతో సబ్జెక్టుల వారీగా విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని.. పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పునఃశ్చరణ చేస్తూ.. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ అమలు చేస్తున్న ప్రణాళికలపై ప్రత్యేక కథనం..

- గద్వాల

2016-17 నుంచి 2022-23 వరకు ఫలితాలు ఇలా..

విద్యా సంవత్సరం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
2016-17	6,763	5,376	79.49
2017-18	7,200	5,483	76.15
2018-19	7,521	6540	86.96
2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో కోవిడ్ కారణంగా విద్యార్థులందరిని ప్రమోట్ చేశారు.			
2021-22	7,920	6,783	85.64
2022-23	7,175	5,790	80.70

విద్యార్థుల హాజరుశాతం ఉత్తీర్ణతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బోధన సమయంలో విద్యార్థులు లేకపోవడంతో అనుత్తీర్ణతకు గురవుతున్నారు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు రాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. చదువు ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు తెలియజేసి, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తీసుకుంటున్నారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చేయడంలో ఉపాధ్యాయులు సఫలీకృతులయ్యారని చెప్పవచ్చు. దీంతో పాటు దాదాపు అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు.

రెండు విభాగాలుగా ప్రత్యేక తరగతులు..

చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీలు, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. రోజు రెండు దశలలో అంటే.. ఉదయం 8నుంచి 9:30 గంటల వరకు, సాయంత్రం 4:45నుంచి 5:45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో రోజు రెండు పాఠ్యాంశాల చొప్పున స్లిప్ టెస్టులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు..



ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎప్పటికప్పుడు మా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు రావాలంటే ఇప్పటి నుంచే సిద్ధం కావాలి. ప్రధాన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించి సాధన చేస్తున్నాం. రోజు వారీగా మూడు దశలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

– మహేశ్వరి, విద్యార్థిని, కేటీదొడ్డి

ఎంతో ఉపయోగం..



ప్రత్యేక తరగతుల వల్ల పాఠ్యాంశాలలోని సందేహాలు పూర్తి స్థాయిలో నివృత్తి అవుతున్నాయి. అన్ని సబ్జెక్టులపై పూర్తిగా అవగాహన కలుగుతుంది. మంచి ఫలితాలు సాధించడానికి ప్రత్యేక తరగతులు దోహదం చేస్తున్నాయి. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– ప్రమీల, విద్యార్థిని, గద్వాల

ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాం..



జిల్లాలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికా బద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల తేదీ ఖరారు కావడంతో రోజు రెండు పూటలు ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల అభ్యసన శక్తి మెరుగయ్యేలా కృషి చేస్తున్నాం. ఈ విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తాం.

– మహ్మద్ సిరాజుద్దీన్, డీఈఓ, గద్వాల


పలు సబ్జెక్టులపై ప్రత్యేక సాధన..

గతంలో ఇంగ్లిష్, గణితం, సామాన్యశాస్త్రంలో చాలామంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. అవసరమైన ప్రయోగశాలలు, సామగ్రి అందుబాటులో లేక ఈ పరిస్థితి ఎదురయ్యింది. దీంతో ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాలలో ఉన్న ప్రయోగ వనరులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గతంలో ఉన్న ప్రశ్నాపత్రాల ఆధారంగా మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

లోక్‌సభకు సన్నద్ధం

ఎంపీ ఎన్నికల సన్నాహాల్లో ప్రధాన పార్టీలు

- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాలకు పోటాపోటీ
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా టీపీసీసీ నేతలతో నేడు కాంగ్రెస్ సమావేశం
- ప్రధాన పార్టీల్లో భారీగా ఆశావహుల జాబితా



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. మరో మూడు నెలల్లో ఎంపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుండటంతో పార్టీలన్నీ ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారి జాబితా భారీగా కన్పిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా గాంధీభవన్‌లో నిర్వహించనున్న టీపీసీసీ కార్యదర్శుల విస్తృతస్థాయి సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి పార్టీ ఇన్‌చార్జిగా రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. బుధవారం కాంగ్రెస్ సమావేశానికి టీపీసీసీ కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, ఒబేదుల్లా కొత్వాల్, వినోద్‌కుమార్ తదితర నేతలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పార్టీ ముఖ్య నాయకులకు ఆహ్వానం అందింది. ఈ నెల 6 తర్వాత నామినేటెడ్ పదవుల కేటాయింపు ఉండటంతో ఈ సమావేశంలో వీటిపై సైతం చర్చించే అవకాశం ఉంది.

17న బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవాన్ని ఎదుర్కొని అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నాలను సాగిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 17న పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఈ మేరకు పార్టీలోని ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులతో సమావేశమై ఎన్నికల వ్యూహాలను రూపొందించనుంది.

తెరపైకి బీసీ నినాదం..

ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలుండగా, నాగర్‌కర్నూల్ స్థానం ఎస్సీలకు రిజర్వ్ కాగా, మహబూబ్‌నగర్ స్థానం జనరల్‌కు అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాల్లో మెజార్టీ ఎమ్మెల్యేలుగా రెడ్డి సామాజిక వర్గానికే చెందిన నేతలు ఉండటంతో ఎంపీగా బీసీలకే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్‌లోని పలువురు నేతలు పట్టుబడుతున్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్‌ను పార్టీ అధిష్టానం ముందు విన్నవించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఎంపీ రాములు ఎటువైపు?

నాగర్‌కర్నూల్ ఎంపీ, బీఆర్‌ఎస్ నేత రాములు పార్టీని వీడనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఆయన తనయుడు భరత్‌ప్రసాద్ రాజకీయ భవిష్యత్‌పై ఎంపీ రాములు ఆలోచనలో పడ్డారని, ఈ దిశగా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై ఆసక్తికరంగా మారింది. పార్టీ మారనున్నట్లు సాగుతున్న ప్రచారంపై ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అలాంటి ప్రచారాలను నమ్మ వద్దని స్పష్టం చేశారు.

అన్ని పార్టీల్లో పోటాపోటీ..

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో ఎంపీలుగా బరిలో నిలిచేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల్లో ఆశావహుల నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానంగా ఏఐసీసీ కార్యదర్శి వంశీ చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి టికెట్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి ఆపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో పాటు తల్లోజు ఆచారి, శాంతకుమార్, దిలీపాచారి సైతం పార్టీ టికెట్‌ను ఆశిస్తున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి తాను బరిలో ఉండనున్నట్లు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే ఆయనకు ప్రభుత్వంలో సలహాదారుడు వంటి ఏదైనా సముచిత స్థానం లభించే ఎంపీ టికెట్ మరొకరికి దక్కుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే అబ్రహం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సైతం ఎంపీ టికెట్ దక్కుతుందనే ఆశలో ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో ఎంపీ రాములుతో పాటు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎవరికి వారు పార్టీ టికెట్ తమకే దక్కుతుందనే ధీమాలో ఉన్నారు. బీజేపీ నుంచి ఎంపీ బరిలో ఆ పార్టీ నేత బంగారు శ్రుతి మళ్లీ పోటీలో ఉండాలని భావిస్తుండగా, ఎంపీ రాములు తనయుడు భరత్ ప్రసాద్ పార్టీ టికెట్ ఆశిస్తూ బీజేపీలో చేరుతారన్న ప్రచారం విన్పిస్తోంది.

నాటి ఆటో డ్రైవర్.. నేడు సింగరేణి సీఎండీ

బలరాంనాయక్‌ది రాజాపూర్ మండలం తిరుమలగిరి తండా

- ఓపెన్ డిగ్రీ చదివి.. ఉన్నత స్థానాలకు..
- ఉన్నత పదవి దక్కడంపై తండావాసుల హర్షం



సింగరేణి సీఎండీగా బాధ్యతలు తీసుకున్న బలరాంనాయక్

రాజాపూర్: పేదరికంతో ఉన్నత చదువులు చదవలేకపోయారు. అయితేనేం అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు సింగరేణి సీఎండీ బలరాం నాయక్. రాజాపూర్ మండలంలోని తిరుమలగిరితండాకు చెందిన హన్యానాయక్, కేస్లీ దంపతుల మొదటి సంతానం బలరాంనాయక్. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో బాల్‌రాంనాయక్ సొంత తండా తిరుమలగిరిలో 1 నుంచి 4వ తరగతి చదివారు. ఆ తర్వాత 5 నుంచి 8 వరకు నడుచుకుంటూ వెళ్లి సమీపంలోని పెద్దరేవల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో, 9 నుంచి 10 వరకు జడ్చర్లలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ జడ్చర్లలోని కాకతీయ పాఠశాలలో చదువుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో తండ్రికి తోడుగా ఉంటూ ఆటో నడుపుతూ.. గ్యాస్ సిలిండర్లు ఇంటింటికి వేస్తూ.. ఇంటర్‌తో పాటు ఓపెన్‌లో డిగ్రీ పూర్తిచేసి 2010లో సివిల్స్‌లో 834 ర్యాంక్ సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా..

బలరాంనాయక్ ముందుగా 2012లో అసిస్టెంట్ కమిషనర్‌గా మేడ్చల్ డివిజన్‌లో బాధ్యతలు స్వీకరించి.. ముంబయిలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్‌గా పనిచేశారు. అక్కడ ఏడేళ్లు పనిచేసిన తర్వాత 2019లో సింగరేణికి వచ్చి.. 2023 వరకు సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్)లో పనిచేశారు. తాజాగా మంగళవారం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు స్వీకరించారు. దీంతో తిరుమలగిరిలో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. బాల్‌రాంనాయక్ తల్లీ కేస్లీ ప్రస్తుతం తిరుమలగిరి సర్పంచ్.

సేవా కార్యక్రమాలు..

బలరాంనాయక్‌కు సొంత తండా అంటే అమితమైన ప్రేమ. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌తో పాటు ఇతరత్రా అవసరమైన వస్తువులను తోటి మిత్రులతో కలిసి అందజేస్తారు.

నూతనోత్సాహంతో పనిచేయాలి



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- న్యూఇయర్ వేడుకల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: అన్నిశాఖల అధికారులు, సిబ్బంది నూతనోత్సాహంతో పనిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ చౌహాన్‌లతో కలిసి కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అధికారులు సరికొత్త లక్ష్యాలతో ముందుకుసాగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా స్థానిక చిల్డ్రన్స్ హోంలో చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చిన్నప్పటి నుంచే గొప్ప ఆశయాలతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారి ముషాయిదాబేగం, సహదేవుడు, సుధారాణి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఏటీఎం సెంటర్..

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన యూబీఐ ఏటీఎం సెంటర్‌ను కలెక్టర్ క్రాంతి ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏటీఎం సెంటర్ ఏర్పాటుతో ఉద్యోగులకు ఉపయోకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ డైరెక్టర్ కె.నిఖిల, మేనేజర్ సత్యనారాయణ, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రమస్మృతి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

గట్టు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ క్రాంతి అన్నారు. మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సరిపడ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హులైన వారు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఉన్నారు.

దండిగా దరఖాస్తులు

- జిల్లావ్యాప్తంగా 19,013 అర్జీలు
- రేషన్‌కార్డులు ఇతర సమస్యలపై మరో 5,857 వినతులు



సంగాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం రెండు రోజుల విరామం అనంతరం మంగళవారం తిరిగి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 35 గ్రామాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 12 వార్డు సభలు నిర్వహించి, దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 19,013 దరఖాస్తులు రాగా.. రేషన్‌కార్డులు ఇతర సమస్యలపై 5,857 అర్జీలు వచ్చాయి.

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

గద్వాల అర్బన్/మల్దకల్/ధరూరు: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. గద్వాల మండలం సంగాల, మల్దకల్ మండలంలోని మేకలసోంపల్లి, కుర్తిరావల్‌చెర్వు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా ధరూరు మండల కేంద్రంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీపీలు రాజారెడ్డి, సజ్జానిస, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓలు జబ్బార్, కృష్ణయ్య, సర్పంచ్ పద్మమ్మ, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, రామకృష్ణ, వీరన్న, రవి కుమార్, సవారన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల వివరాలు..

మున్సిపాలిటీ	వార్డులు	దరఖాస్తులు
గద్వాల	5	1,925
అయిజ	3	1,184
అలంపూర్	2	646
వడ్డేపల్లి	2	583
మండలం	**గ్రామాలు**	**దరఖాస్తులు**
గద్వాల	4	1.255
ధరూరు	2	2,344
మల్దకల్	4	1,576
గట్టు	4	1,746
కేటీదొడ్డి	3	1,111
అలంపూర్	2	1,340
మానవపాడు	2	2,067
ఉండవెల్లి	2	820
ఇటిక్యాల	2	708
ఎర్రవల్లి	2	1,169
వడ్డేపల్లి	2	1,880
రాజోళి	2	1,083
అయిజ	4	1,914

దరఖాస్తు గడువు పొడిగింపు

గద్వాల అర్బన్: 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిణి శ్వేతా ప్రియదర్శిని మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈనెల 31వ తేదీలోగా www.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను జిల్లా కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

గద్వాల న్యూటౌన్: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ నిఖిల సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు, సీనియర్ సిటిజన్స్‌కు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి ఏటీఎం, పిన్ నంబర్లు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని సూచించారు. అదేవిధంగా గుర్తింపు లేని వ్యక్తులు లేదా సంస్థల నుంచి రుణాలు తీసుకోవద్దని తెలిపారు. ఆర్‌బీఐ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం శ్రావ్య, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, నాబార్డ్ డీడీఎం షణ్ముఖాచారి, జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఎల్‌డీఓ దెబోతిచ్ బోరా, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ నిఖిల

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


ఉషశ్రీ (ఫైల్)

వంగూరు: నిత్యం భర్త పెట్టే వరకట్న వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వంగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహేష్‌కు మూడేళ్ల క్రితం వనపర్తికి చెందిన ఉషశ్రీతో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం తేవాలని మహేష్ భార్యను వేధించేవాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొంత సమయం తర్వాత ఇంట్లోకి వచ్చిన అత్త కృష్ణమ్మ, భర్త మహేష్‌లు ఫ్యాన్‌కు వేలాడుతున్న ఉషశ్రీని కిందికి దించారు. అలోపే ఆమె చనిపోయింది. వారికి రెండేళ్ల పాప ఉంది. ఉషశ్రీ తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణమైన మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


బాల్‌రాజు(ఫైల్)

చారకొండ: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవి కథనం ప్రకారం.. వెల్దండ మండల కేంద్రాని చెందిన మల్లెపల్లి బాల్‌రాజు(28) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండలంలోని జూపల్లి శివారులో వెల్దండ మండల కేంద్రానికి చెందిన మల్లేపల్లి బాల్‌రాజు, గోరటి సుధాకర్, ఈదులపల్లి రమేష్, ఆలూరి ప్రవీణ్‌లు రోజులుగా జియో సంబంధిత నెట్ వర్క్ కంపెనీలో పని చేస్తున్నారు. సంబంధిత స్టీల్ స్తంభాలను పాతుతుండడంతో స్టీల్ స్తంభాలను పైకి లేపడంతో పని చెస్తున్న దగ్గర 11కేవీ విద్యుత్ లైన్‌కు తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై నలుగురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అప్పటికే బాల్‌రాజు మృతి చెందినట్లు తెలిపారు. సుధాకర్ చికిత్స పొందుతున్నాడు. ఆయనకు భార్య బాగ్యలక్ష్మి, కూతురు జహ్నవి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నవదంపతులకు గాయాలు

- భార్య డిగ్రీ పరీక్షకు బైక్‌పై వెళ్తూ ప్రమాదం

అమరచింత: భార్యకు డిగ్రీ పరీక్ష ఉందని, సమయానికి వెళ్లాలని భార్యాభర్తలు బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం పట్టణ శివారులో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాంరెడ్డిపల్లెకు చెందిన మల్లేశంకు గత నెలలో అల్లీపురానికి చెందిన స్వాతితో వివాహమైంది. ఆ అమ్మాయి ఆత్మకూర్‌లో డిగ్రీ చదువుతుంది. భార్యకు మంగళవారం ఆత్మకూర్‌లో డిగ్రీ పరీక్ష ఉండటంతో, పరీక్ష రాసేందుకు బైక్‌పై భార్యాభర్తలు పాంరెడ్డిపల్లె నుంచి బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో అమరచింత నుంచి పాంరెడ్డిపల్లెకు వెళ్తున్న శ్రీరాం బైక్‌లు అమరచింత శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆ ముగ్గురిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

గూడ్స్ ఆటో దగ్ధం

పెబ్బేరు రూరల్: వరిగడ్డిని తరలిస్తున్న గూడ్స్ ఆటోకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైన ఘటన వనపర్తి మండలం పెద్దగూడెం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వనపర్తికి చెందిన కొమ్మరి బాలరాజు గూడ్స్ ఆటోలో పెద్దగూడెం నుంచి వరిగడ్డిని తరలిస్తుండగా... గ్రామ శివారులోని శివాలయం వద్ద విద్యుత్‌వైర్లు తగలడంతో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో గడ్డితో పాటు ఆటో దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

సైబర్ కేసు నమోదు

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి పార్ట్ టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లతో మోసపోయాడు. పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన మాణిక్‌పాషా మొబైల్‌కు అక్టోబర్ 31న పార్ట్‌టైం జాబ్ కోసం మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను చూడగా.. వాళ్లు కొంత డబ్బు వేశారు. నేను వాళ్లకి రెండు విడతలుగా రూ.1.48లక్షలు వేశాను. తర్వాత టాస్క్ పూర్తి చేయలేదని, మరోసారి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారని బాధితుడు తెలిపారు. తన డబ్బులు అడిగితే అవి తిరిగి వేయలేమని చెప్పారని వాపోయాడు. ఇంకా డబ్బులు వేయాలి అని చెప్పడంతో వారిపై అనుమానం వచ్చి టౌన్ పోలీసుస్టేషన్‌లో వెంటనే ఫిర్యా దు చేశానని పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు అవగాహన సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ పరిస్థితులు, ఒత్తిడి ఎదుర్కోవడం ఎలా అనే అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ, సైకాలజిస్టు రవీందర్ హాజరు కానున్నట్లు తెలిపారు.

అనారోగ్యంపాలు

- ధనార్జనే ధ్యేయంగా కృత్రిమ పాల తయారీ
- పూటకో సెంటర్ పుట్టుకొస్తున్న వైనం
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమార్కులు


అచ్చంపేటలో పాలలోని వెన్నశాతం పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్



అచ్చంపేట రూరల్: పాడి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన ఉమ్మడి పాలమూరు జిల్లా.. ప్రస్తుతం కల్తీపాలతో మసకబారుతోంది. అక్రమ వ్యాపారులకు అడ్డాగా నిలుస్తోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు హానికరమైన రసాయనాలతో కృత్రిమ పాలు తయారు చేస్తున్నారు. వాటితో పన్నీరు, కోవా, పెరుగు తదితర పదార్థాలను తయారుచేసి విక్రయిస్తున్నారు. అక్రమార్కుల పా'పాల'తో అందరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు.

డిమాండ్ పెరగడంతో..

పసిబిడ్డల నుంచి వృద్ధుల వరకు పాలు, టీ తాగుతుంటారు. అలాగే పెరుగు, కోవా, పన్నీరు, నెయ్యి తదితరాలు మనిషి జీవనంలో భాగమయ్యాయి. హైదరాబాద్ నగరం సమీపంలో ఉండటంతో పాలకు మరింత డిమాండ్ పెరిగింది. గృహ యజమానులు, హోటళ్లు, మిఠాయి దుకాణాలకు రోజుకు వేల లీటర్లలో సరఫరా చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిని విజయ డెయిరీతో పాటు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు నేరుగా విక్రయిస్తున్నారు. పాల డిమాండ్ విపరీతంగా పెరగడంతో అక్రమార్కులు కృత్రిమంగా పాలు తయారు చేసి.. కాసులు దండుకుంటున్నారు.

పట్టణ ప్రాంతాల్లో అధికం..

పట్టణ ప్రాంతాల్లో పాల విక్రయ కేంద్రాలు అధికంగా వెలుస్తున్నాయి. పల్లెల నుంచి పాలను తీసుకొస్తున్నామని చెబుతూ క్యాన్లలో అక్కడక్కడ విక్రయాలు సాగిస్తున్నారు. అమాయక ప్రజలు వీరిని నమ్మి పాలను కొనుగోలు చేస్తున్నారు. దశాబ్ద కాలంగా కృత్రిమ పాల తయారీ దందా సాగుతున్నా.. ఆహార పరిరక్షణ, స్థానిక యంత్రాంగం గుర్తించలేకపోతోంది. రసాయనాలు, పాలపొడి, నూనె, యూరియా, నీటి మిశ్రమాన్ని కలిపి తయారు చేసే ద్రావణంతో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. కొందరు వెన్న తీసిన పాలలో యూరియా కలిపి వెన్న శాతాన్ని పెంచుతున్నారు. వెన్న శాతం ప్రకారం లీటరు పాలు రూ.40 నుంచి రూ.60 వరకు రైతుల వద్ద లభిస్తున్నాయి. సాధారణ వ్యక్తులు కృత్రిమ పాలను గుర్తించలేరు. మరికొందరు పాలలో మీగడ తీసి యూరియా, నూనె ప్యాకెట్లు, సర్ఫు ద్వారా కృత్రిమ పాలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అచ్చంపేటలో మెరుపు దాడులు...

అచ్చంపేటలో కృత్రిమ పాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో పలు ప్రైవేటు పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. లింగాల రోడ్డులోని శ్రీనివాస మిల్క్ సెంటర్, రైతు పాల విక్రయ కేంద్రంతో పాటు మరో రెండు సెంటర్లను పరిశీలించి, పాల శాంపిల్స్ సేకరించారు. అలాగే బస్టాండ్, పాత బజార్ ప్రాంతాల్లోని పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా.. గత డిసెంబర్‌లో ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అచ్చంపేటలోని పాల కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ కల్తీ చేయడంతో పాటు పాడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వచ్చిన ఆరోపణల మేరకు తనిఖీలు చేపట్టి.. కృత్రిమ పాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కఠిన చర్యలు తప్పవు..

అచ్చంపేటలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నాలుగు సెంటర్ల యజమానులకు నోటీసులు జారీ చేశాం. వారి నుంచి పాల శాంపిళ్లను సేకరించాం. హైదరాబాద్‌లోని స్టేట్ ల్యాబరేటరీకి శాంపిళ్లను పంపిస్తాం. పాలలో కల్తీ ఉన్నట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తప్పవు. ప్రజల ఆరోగ్యానికి హాని కల్గిస్తే ఉపేక్షించేది లేదు.

– మనోజ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ, పోలీస్ సిబ్బంది


మృతిచెందిన శ్రీనివాస్ (51)

కల్వకుర్తి టౌన్: విధి నిర్వాహణలో పోలీస్‌స్టేషన్ వాచ్ ఇన్‌చార్జి కుప్పకూలి పడిపోయి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం కల్వకుర్తిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మూడు నెలల క్రితం డ్యూటీలో చేరిన శ్రీనివాస్ (51) వాచ్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 9గంటల సమయంలో విధుల్లో ఉన్న ఆయనకు బీపీ తగ్గడంతో కిందపడిపోయాడు. వెంటనే అతన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఇంటర్నల్ బ్లీడింగ్ ఎక్కువ అయినట్లు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీనివాస్ స్వస్థలం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు భార్య, కూతురు ఉంది.

పోలీసుల నివాళి

డ్యూటీలో శ్రీనివాస్ చాలా నిబద్ధతో పనిచేసేవాడని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారధి తెలిపారు. శ్రీనివాస్ చిత్రపటానికి సీఐ, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో కలిసిపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని డిపార్టుమెంట్ తరుపున ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు రమేష్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యుషన్ బోర్డుకు ఫిర్యాదు

నవాబుపేట: పంట పొలాల మధ్య ఉన్న క్రషర్ మిషన్లను తొలగించాలని చౌదూర్ రైతులు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పొల్యుషన్ బోర్డు అధికారికి కృష్ణాఆదిత్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన క్రషర్ ద్వారా ప్రమాదం ఉందని, కాబట్టి అట్టి క్రషర్‌ను విచారణ చేసి తొలగించాలని వారు కోరారు. ఇది వరకే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు పట్టించుకోవటం లేదని తెలిపారు. రైతులకు ఇబ్బందులు చేకూరుస్తున్న క్రషర్‌కు అనుమతి ఇవ్వకుండా, విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో చౌదూర్ రైతులు ఆంజనేయులు, గోపాల్, శ్రీనివాస్, మల్లేష్, సుదర్శన్, సాయి, శంకర్, బీమయ్య ఉన్నారు.

విద్యుత్ వైర్ చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని కుమ్మెర సమీపంలో జరుగుతున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనుల వద్ద విద్యుత్ వైర్ చోరీ జరిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుల సమాచారం మేరకు.. కుమ్మెర సమీపంలో జరుగుతున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన 700 మీటర్ల విద్యుత్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కంపెనీ నిర్వాహకుడు పులేందర్ తెలిపారు. విద్యుత్ వైర్ విలువ రూ.2.50లక్షలు ఉంటుందని పేర్కొన్నాడు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలయూరు యూనివర్సిటీ జంతుశాస్త్ర అధ్యాపకుడు సిరిగిరి గురుస్వామికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు ఆయన ఓయూ జంతుశాస్త్రం అధ్యాపకులు మాధవి ఆధ్వర్యంలో 'డైవర్సిటీ అండ్ ఎకాలజీ ఆఫ్ స్పైడర్ ఫనా ఇన్ డిఫరెంట్ ఆగ్రో ఎకో సిస్టం ఆఫ్ మహబూబ్‌నగర్– తెలంగాణ' అనే అంశాలపై పరిశోధన చేసినందుకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందడంతో పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ, అధ్యాపకులు అభినందించారు.

క్యారెట్ సాగుతో అధిక లాభాలు


సాగులో ఉన్న క్యారెట్ పంట

- వరికి ప్రత్యామ్నాయం
- చీడ పీడలు, ఎరువులు, పురుగు మందులు తక్కువే


కోత కోసిన క్యారెట్

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: జిల్లాలో ఎర్ర నేలలు, మసక నేలలు విస్తారంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ నేలల్లో బోర్లు, బావుల కింద వరి పంట సాగు చేస్తారు. కానీ వరికి బదులుగా క్యారెట్‌ను సాగు చేస్తే అన్ని విధాల లాభదాయకం. క్యారెట్‌తో మంచి లాభాలు ఉంటాయని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. క్యారెట్ సాగు వివరాలను రైతులకు వివరిస్తున్నారు.

పొలం తయారీ..

పొలాన్ని దుక్కి చేసి సిఫార్సు చేసిన ఎరువులను వేసి పొలం మెత్తగా ఉండేలా చూసుకోవాలి. చిన్న మడులుగా చేసుకొని 25 సెంటీమీటర్ల దూరంలో బోదెలు వేసుకోవాలి.

రకాలు..

కరోడ, పూసా కేసర్, పూసా యమదగ్ని, నాంటెస్ ఇండియా గోల్డ్ ఈ రకాలన్నీ 100 నుంచి 120 రోజుల లోపు పంట చేతికోస్తుంది.

విత్తన మోతాదు..

ఎకరానికి 3 కిలోల విత్తనం సరిపోతుంది.

ఎరువులు..

ఎకరానికి 4 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు, యూరియా 40 కిలోలు, ఎస్ఎస్‌పీ(సూపర్) 110 కిలోలు, పోటాష్ 60 కిలోలు ఆఖరి దుక్కిలో వేయాలి. మిగతా 20 కిలోల యూరియా పంట 40 నుంచి 45 రోజుల్లో పైపాటుగా వేయాలి. దుంప ఊరే సమయంలో 13:0:45ను 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

పంట సాగులో మెలకువలు..

- విత్తనాన్ని ఇసుకతో కలిపి నాటుకోవాలి. విత్తనం, ఇసుక 1:4 నిష్పత్తిలో కలిపి నాటుకోవాలి.
- నత్రజని అధిక మోతాదులో వాడరాదు. అధిక మోతాదులో వాడితే కోత అలస్యమై పగుళ్లు ఏర్పడతాయి.
- కాల్షియం లోపంతో దుంపపై నొక్కులు ఏర్పడి నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. దీని నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొలాన్ని సరిగ్గా దుక్కి చేయకుంటే, సేంద్రియ ఎరువులు వాడకుంటే దుంప నేలలోకి వెళ్లకుండా చీలిపోతుంది. కాబట్టి దుక్కి జాగ్రత్తగా చేసుకోవాలి.

కలుపు యాజమాన్యం..

విత్తనం వేసిన రెండు రోజుల లోపు పెండి మిథాలి ఒక లీటరును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 25 రోజుల తర్వాత మెట్రిబుజిన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

నీటి యాజమాన్యం..

8 నుంచి 15 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. డ్రిప్ ద్వార, ఎత్తైన మడుల ద్వార నీరందిస్తే నాణ్యత గల దుంపలు అధిక దిగుబడి పొందవచ్చు.

సస్యరక్షణ..

ఈ పంటలో సస్యరక్షణ చాల తక్కువ. ఆకు మచ్చ నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పచికారీ చేసుకోవాలి.

పంట కోత..

దుంపలు ముదిరిన తర్వాత నారింజ రంగుకు మారుతాయి. దుంపలు ముదిరిన తర్వాత పొలానికి నీరు పెట్టి మరుసటి రోజు ఆకులతో సహా దుంపలను తీసివేయాలి. కోత ఆలస్యమైతే దుంపల నాణ్యత తగ్గుతుంది. యాజమాన్య పద్ధతులను బట్టి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

పెద్ద నాలాపై అక్రమంగా డబ్బాలు


ఏళ్లతరబడి కిరాయి వసూలు చేస్తున్న డబ్బాలు ఇవే..

- ఏళ్ల తరబడి అద్దె వసూలు చేస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు
- గతంలోనే శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్ల కూల్చివేత
- చదును చేసిన ఖాళీ స్థలంపైనా అక్రమార్కుల కన్ను!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణం నడిబొడ్డున.. ఆపై మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పెద్ద నాలా ఉంది. ఆ ప్రాంతం బఫర్ జోన్ పరిధిలోకి వస్తుంది. చుట్టుపక్కల వ్యాపార, వాణిజ్య దుకాణ సముదాయాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ చదరపు గజం విలువ రూ.లక్షకు పైగా ఉంటుంది. ఇంకేముంది అక్రమార్కుల కన్ను పడింది. ఓ వ్యక్తి ఏకంగా పెద్ద నాలాపై రేకుల డబ్బాలను వేసి కిరాయి ఇచ్చేశాడు. ఈ తతంగం ఏళ్ల తరబడి కొనసాగుతున్నా నీటిపారుదల, మున్సిపల్ అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. వాస్తవానికి ఈ నాలాకు ఇటు, అటు వైపు తొమ్మిది మీటర్ల చొప్పున ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేపట్టవద్దు. ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఏకంగా 14 రేకుల డబ్బాలు వేశారు. వీటిలో మొదట సుమారు 15 ఏళ్ల క్రితం ఆ స్థలం తమదేనంటూ భగీరథకాలనీలో నివసముండే ఓ వ్యక్తి మూడు రేకుల డబ్బాలు వేసి నెలకు ఒక్కోదానికి రూ.1,500 చొప్పున అద్దెకి ఇచ్చేశాడు. అలాగే పదేళ్ల క్రితం మరో ఐదు డబ్బాలు (షెట్టర్లు కలిగినవి) వేశాడు. వీటి నుంచి రూ.మూడు వేల చొప్పున కిరాయిదారుల నుంచి వసూలు చేస్తున్నాడు. ఇలా ఇప్పటికే ఈయనకు రూ.25 లక్షలకు పైగా అద్దె రూపంలో అందింది. వీటి పక్కనే తాజాగా పది రోజుల క్రితం ఏకంగా ఆరు షెట్టర్లు కలిగిన పెద్ద రేకుల డబ్బా అఖండం వేశాడు.

నోటీసులు జారీ చేసినా..

ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు డిసెంబర్ 26న సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేసినా ప్రయోజనం దక్కలేదు. ఇప్పటివరకు ఎలాంటి జవాబు ఇవ్వకపోవడం కొసమెరుపు. ఈయనకు స్థానిక కౌన్సిలర్, కొందరు మున్సిపల్ అధికారులతో పాటు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. వీటి పక్కనే అప్పట్లో వేపూరిగేరి వాసుల కోసం సామూహిక మరుగుదొడ్లను మున్సిపల్ అధికారులు నిర్మించారు. అయితే అవి శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడాదిన్నర క్రితం 'పట్టణ ప్రగతి'లో కూల్చివేసి మొత్తం చదును చేశారు. ఈ ప్రదేశంపైనా కొందరి అక్రమార్కుల కన్ను పడింది. ఇప్పటికైనా అక్రమంగా వెలసిన ఈ డబ్బాలను తొలగించి రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ పక్కన చదును చేసిన ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పచ్చదనం పెరిగేలా చూడాలన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


అది ప్రభుత్వ స్థలమే

పెద్ద నాలాపై అక్రమంగా ఏర్పాటుచేసిన రేకుల డబ్బాల స్థలం ముమ్మాటికీ ప్రభుత్వానిదే. అక్కడ మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా వాటిని వేయడం చట్టవిరుద్ధం. ఈ విషయమై ఇటీవలే సదరు వ్యక్తికి నోటీసులు కూడా అందజేశాం. ఇప్పటివరకు ఎలాంటి జవాబు రాలేదు.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్


పెద్ద నాలాపై అక్రమంగా ఏర్పాటు చేసిన ఆరు షెట్టర్ రేకుల డబ్బాలు

ఇద్దరికి కరోనా పాజిటివ్



పాలమూరు: జిల్లాలో మరోసారి కరోనా కలకలం రేపుతోంది. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అనుమానితులు పెరుగుతుండగా పాజిటివ్ కేసులు సైతం వస్తున్నాయి. తాజాగా మంగళవారం జనరల్ ఆస్పత్రిలో 18 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. వీరిలో జిల్లాకేంద్రానికి చెందిన 8 నెలల గర్భిణి, భూత్పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వైరస్ నిర్ధారణ అయ్యింది. ఇద్దరికి కూడా స్వల్ప లక్షణాలు ఉండటంతో ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 463 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. తాజాగా కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయడానికి ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం వ్యాపిస్తున్న కరోనా లక్షణాల తీవ్రత తక్కువగా ఉంటుందని వైద్యాధికారులు చెబుతున్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు పర్యాయాలు కరోనా విజృంభించినప్పుడు జాగ్రత్తలు తీసుకున్నట్లుగానే ఇప్పుడు కూడా మాస్కులు ధరించడం, తరుచుగా చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరం పాటించడం, అవసరమైతే తప్ప జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, సోకినట్లుగా తేలితే మిగతా కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాలని పేర్కొంటున్నారు. చలికాలంలో ఆస్తమా బాధితులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

నర్సింగ్ కళాశాలలో రెండో బ్యాచ్ ప్రారంభం

పాలమూరు: జిల్లాకేంద్రంలోని పాలమూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ రెండో బ్యాచ్ ప్రారంభమైంది. గతేడాది డిసెంబర్ 4 నుంచి చివరి వారం వరకు అడ్మిషన్లు కొనసాగగా.. 60 మంది చేరారు. ఇప్పటికే ఫస్ట్ బ్యాచ్‌లో 56 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా సెకండ్ బ్యాచ్‌లో మరో 60 మంది చేరడంతో మొత్తం 116 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి ఆస్పత్రి ఆవరణలోని భవనాల్లో వసతి కల్పించారు. తరగతి గదులతోపాటు విద్యార్థులకు వసతి గృహానికి ప్రస్తుతం ఉన్న గదులు సరిపోవడం లేదని కొత్తగా గదుల కేటాయింపు చేయాలని ఇటీవల కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామని ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మి వెల్లడించారు. ప్రస్తుత ఎంసీహెచ్ భవనంలో ఖాళీగా ఉన్న కొన్ని గదులను నర్సింగ్ కళాశాలకు కేటాయించాలని కలెక్టర్‌ను కోరామని, నూతన భవన నిర్మాణం కోసం త్వరలోనే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే కళాశాలకు ప్రత్యేక భవనం ఏర్పాటవవుతుందన్నారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన సెకండ్ బ్యాచ్ విద్యార్థులకు సైతం తరగతులు ప్రారంభించామని, ఫస్ట్ బ్యాచ్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని చెప్పారు.

జన బలమే గీటురాయి

24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: నిరంతరం ప్రజాక్షేత్రంలో గడుపుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి ప్రజల మనసులకు మరింత చేరువైన నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. సామాజిక న్యాయంలో మరో అడుగు ముందుకేశారు. బీసీలు, మహిళలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక సాధికార ఛాంపియన్ అని మరోసారి రుజువు చేసుకున్నారు. మహిళలు, యువతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ 24 శాసనసభ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో జాబితాను ఖరారు చేశారు. గతంలో అగ్రవర్ణాలకు అవకాశం కల్పించిన ఏడు అసెంబ్లీ స్థానాల్లో తాజాగా ఐదు చోట్ల బీసీలను సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి ఈ వివరాలను ప్రకటించారు. గత నెల 11వతేదీన 11 శాసనసభ స్థానాలకు నూతన సమన్వయకర్తలను ప్రకటిస్తూ వైఎస్సార్ సీపీ మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. రెండు జాబితాల్లో కలిపి మొత్తం 35 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తలు వీరే..

లోక్‌సభ స్థానం పేరు	సమన్వయకర్త
అనంతపురం	మాలగుండ్ల శంకరనారాయణ(బీసీ-కురుబ)
హిందూపురం	జోలదరాశి శాంత(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి(ఎస్టీ)
శాసనసభ స్థానం పేరు	**సమన్వయకర్త**
రాజాం(ఎస్సీ)	డాక్టర్ తాలె రాజేష్
అనకాపల్లి	మలసాల భరత్ కుమార్(ఓసీ-కాపు)
పాయకరావు పేట(ఎస్సీ)	కంబాల జోగులు
రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాశ్(బీసీ-శెట్టిబలిజ)
పి. గన్నవరం(ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
పిఠాపురం	వంగ గీత(ఓసీ-కాపు)
జగ్గంపేట	తోట నరసింహం(ఓసీ-కాపు)
పత్తిపాడు	వరుపుల సుబ్బారావు(ఓసీ-కాపు)
రాజమంత్రి సిటీ	మార్గాని భరత్(బీసీ-గౌడ)
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ(బీసీ-శెట్టిబలిజ)
పోలవరం(ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
కదిరి	బీఎస్ మక్బూల్ అహ్మద్
ఎర్రగొండపాలెం(ఎస్సీ)	చంద్రశేఖర్
ఎమ్మిగనూర్	మాచాని వెంకటేశ్(బీసీ-పద్మశాలి)
తిరుపతి	భూమన అభినయ్ రెడ్డి
గుంటూరు ఈస్ట్	షేక్ నూరి ఫాతిమా
మచిలీపట్నం పేర్ని	కృష్ణమూర్తి(కిట్టు)
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
పెనుకొండ	కేవీ ఉషా శ్రీచరణ్(బీసీ-కురుబ)
కళ్యాణదుర్గం	తలారి రంగయ్య(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	గొడ్డేటి మాధవి
పాడేరు(ఎస్టీ)	మత్స్యరాస విశ్వేశ్వర రాజు
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస రావు(ఓసీ- వైశ్య)
విజయవాడ వెస్ట్	షేక్ ఆసిఫ్

కురుబ (బీసీ) సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. బోయ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ జోలదరాశి శాంత హిందూపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని అరకు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించగా, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని అరకు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి,, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కేవీ ఉషాశ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి, రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

బీసీలు, మైనార్టీలకు పెద్దపీట..

రెండు దఫాల్లో ప్రకటించిన 35 శాసనసభ స్థానాల సమన్వయకర్తల జాబితాను పరిశీలిస్తే సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీకి పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీలకు, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. ఇక ఐదు శాసనసభ స్థానాలకు మహిళలను సమన్వయకర్తలుగా నియమించారు. పది స్థానాల్లో యువతీ యువకులకు సమన్వయకర్తలుగా అవకాశం కల్పించారు. మొత్తమ్మీద 35 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో ఎస్సీలు 9 మంది, ఎస్టీలు ముగ్గురు, బీసీలు 11 మంది, మైనార్టీలు ముగ్గురు, అగ్రవర్ణాలు 9 మంది (రెడ్డి, కాపు, వైశ్య) చొప్పున ఉన్నారు.

175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా

గత 55 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, చరిత్ర ఎరుగని విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ జనరంజక పరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ(ప్రత్యక్ష నగదు బదిలీ)తో రూ.2.45 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందగా అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో తీసుకొచ్చిన మార్పులు కళ్లెదుట కనిపిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పి వారితో మమేకమై మరింత మేలు చేయడానికి ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజలతో మమేకం కాకుండా వారి మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం జగన్ తేల్చి చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అవసరమైన చోట్ల నూతన సమన్వయకర్తలను నియమిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీ శాంత

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ జె. శాంత మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఆమె వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. ఆమె 2009లో లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. పార్టీలో చేరిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జె.శాంత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలకు ఆయనపై నమ్మకం ఏర్పడిందని, అందుకే వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. పార్టీలో సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని తెలిపారు.



ఎల్బీనగర్‌లో ఓ పెట్రోల్ బంకు వద్ద రద్దీ



లక్డీకపూల్‌లో వాటర్ క్యాన్లతో పెట్రోల్ పట్టుకెళుతున్న దృశ్యం

పెట్రోల్ కటకట!

▶ మొదటి పేజీ తరువాయి

వర్ణనాతీతంగా మారింది. రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో..

వాస్తవానికి రెండురోజుల క్రితమే వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఫలితంగా పెట్రోల్ బంకులకు సరఫరా నిలిచిపోయింది. ఇక బుధవారం నుంచి దేశవ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు పూర్తి స్థాయిలో సమ్మెకు దిగనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో వాహనదారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం వేలాదిగా వాహనాలు బారులు తీరాయి. సమ్మె ఎన్ని రోజులు కొనసాగుతుందో అన్న ఆందోళనతో ఎక్కువమంది ట్యాంకులు ఫుల్ చేయించడం కన్పించింది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద క్యాన్లలో ఆయిల్ నింపుకొని తీసుకెళ్లారు. దీంతో మధ్యాహ్నానికల్లా చాలా వరకు బంకుల్లో నిల్వలు ఖాళీ అయ్యాయి. ఆయా బంకుల యాజమానులు బంకులు మూసేసి నో స్టాక్ బోర్డులు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3,500 పెట్రోల్ బంకులు ఉండగా 3 వేల వరకు బంకులు మూతపడటంతో సాయంత్రానికి పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమయ్యింది. హైదరాబాద్ నగరంలోని పెట్రోల్ బంకులన్నింటిలో నిల్వలు ఖాళీ అయ్యాయి.

తాత్కాలికంగా సమ్మె విరమణ

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో నిల్వలు ఖాళీ కావడంతో డీలర్ల సొంత ట్యాంకర్లను రంగంలోకి దింపారు. వారు ఆందోళన విరమించి ఇంధన సరఫరాకు సిద్ధమయ్యారు. మరోవైపు సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు రాష్ట్ర పెట్రోల్ డీజిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. కేంద్రం తీసుకొచ్చిన మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లుకు నిరసనగా డ్రైవర్లు సోమవారం నుంచి ఆయిల్ టాంకర్స్ నిలిపివేసి ఆకస్మిక సమ్మెలోకి వెళ్ళారని తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల అసోసియేషన్లు కూడా సమ్మె విరమించే అవకాశాలు ఉండటం, చమురు సంస్థల డిపోల వద్దకు డీలర్ల ట్యాంకర్లు లోడింగ్‌కు చేరుకోవడంతో బుధవారం ఆయిల్ సరఫరాకు అంతరాయం ఉండబోదని డీలర్ల వర్గాలు ప్రకటించాయి.

ఇంధన సరఫరాలో కొరత ఉండదు: పౌరసరఫరాల శాఖ కమిషనర్

ఇంధన ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు పిలుపునివ్వడంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమ్మె చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లతో చర్చించాలని, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా చూడాలన్నారు. ఆయిల్ కంపెనీలకు, డ్రైవర్లకు తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే విధుల్లో చేరాలని ట్యాంకర్ల డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని కమిషనర్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అప్పా జంక్షన్ వద్ద ఎస్‌ఐకి గాయాలు!

రాజేంద్రనగర్: బండ్లగూడ అప్పా జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి సిబ్బందికి వాహనదారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పెట్రోల్ కోసం వచ్చిన సందర్భంగా వాగ్వివాదం జరగడంతో పరస్పరం దాడి చేసుకున్నట్టు సమాచారం. ఈ పెట్రోల్ బంకును పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. విధుల్లో ఉన్న ఒక ఎస్‌ఐ ర్యాంకు అధికారితో పాటు సిబ్బందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అయితే దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు చెప్పారు.

సీఎం జగన్‌ను ఎదుర్కోలేక దుష్ప్రచారం చేస్తారా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై వైవీ సుబ్బారెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: ఏపీలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ ప్రజల్లో ఆదరణ మరింతగా పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో కలిసి కట్టుకథలు అల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా వైఎస్ విజయమ్మను, కుటుంబ సభ్యులను కలుస్తానని తెలిపారు. ఇటీవల అమెరికాకు వెళ్లి వచ్చిన విజయమ్మను ఆదివారం కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుకున్నట్లు చెప్పారు. ఆ తర్వాత షిరిడి వెళ్లి, సోమవారం రాత్రి విజయవాడ వచ్చాక ఎల్లో మీడియాలో వార్తలు చూశానని తెలిపారు. షర్మిలతో తాను మధ్యవర్తిత్వం చేసినట్లు కట్టుకథలు అల్లారని మండిపడ్డారు. కుటుంబ సభ్యులను కలవడానికి వెళ్తే రాయబారానికి వెళ్లినట్లా అని ప్రశ్నించారు. చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడం కోసమే ఎల్లో మీడియా తమపై బురద జల్లుతోందని, వారి దుష్ప్రచారం పరాకాష్టకు చేరిందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌దే విజయమని స్పష్టం చేశారు.

విద్య, వైద్యం, ఉపాధికి ప్రాధాన్యం



స్టేషన్ మహబూబ్‌నగర్: విద్య, వైద్యం, ఉపాధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. జిల్లా ప్రజలు అన్ని రకాలుగా మేలు జరిగి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు పనిచేస్తూ ముందుకు సాగుతామన్నారు. బాసర తరహాలో మహబూబ్‌నగర్‌లో ఐఐఐటీ ఏర్పాటు చేస్తామని, ఈ మేరకు సీఎం దృష్టికి తీసుకెళ్లి, స్థల పరిశీలనకు కోసం అధికారులకు సూచించామన్నారు. మహిళల కోసం డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మారుస్తామన్నారు. ఐటీ టవర్‌కు మరిన్ని కంపెనీలు వచ్చేలా చూస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని, కొంతమంది డబ్బులు తీసుకొని కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలనకు అనూహ్య స్పందన లభిస్తుందని వివరించారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఎవరూ ఫ్లెక్సీలు పెట్టవద్దని, అవకాశం ఉంటే నోట్‌బుక్‌లు ఇస్తే వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి పండుగ తర్వాత అందజేస్తామన్నారు. సమావేశంలో నాయకులు సురేందర్‌రెడ్డి, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

- ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నేటి నుంచి అమలు
- నియోజకవర్గంలోని ఐదు కళాశాలల్లో 1,300 మంది విద్యార్థులకు సౌకర్యం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2018లో మధ్యాహ్న భోజనం పెడుతున్న అధ్యాపకులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచటం, పౌష్టికాహారం అందించే లక్ష్యంగా నియోజకవర్గంలోని ఐదు కళాశాలల్లో నేటి నుంచి మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి జన్మదినం డిసెంబర్ 31 పురస్కరించుకుని విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయిస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు బుధవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు.

నెరవేరని హామీ..

ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు రఘురాం మరికొందరు దాతల సహకారంతో అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి జడ్చర్ల కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. 2018, 2019 రెండేళ్ల పాటు నిరాటంకంగా భోజనం అందించటంతో హాజరు శాతం పెరిగి ఉత్తమ ఫలితాలు రాబట్టగలిగారు. ఈ క్రమంలోనే సీఎంను కలుసుకున్న సందర్భంలో అధ్యాపకుడు రఘురాం విద్యార్థుల మధ్యాహ్న భోజనం గూర్చి వివరించారు. జడ్చర్ల కళాశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం గూర్చి అప్పటి సీఎం కేసీఆర్ అప్పటి ఎమ్మెల్యేతో పాటు అధ్యాపకుడు రఘురాంను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు.



ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల

అయితే కరోనా కారణంగా ప్రతిపాదనలు అటకెక్కి సీఎం హామీ నెరవేరలేదు.

ప్రస్తుతం..

జడ్చర్ల ఎమ్మెల్యేగా జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విజయం సాధించిన తరువాత కళాశాలల్లోని విద్యార్థుల పరిస్థితిని అధ్యాపకులు రఘురాం తదితరులు వివరించారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితో ఉండరాదని తన జన్మదినం రోజున మధ్యాహ్న భోజనం ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు నియోజకవర్గంలోని ఐదు కళాశాలల్లో బుధవారం నుంచి భోజనం అందించనున్నారు. పట్టణంలోని ఓ మెస్‌లో తయారు చేయించిన భోజనాన్ని ఆటోల ద్వారా అన్ని కళాశాలలకు చేర్చనున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో అప్పటి వరకు పథకం కొనసాగనుంది.

నియోజకవర్గంలోని ఆయా కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య..

కళాశాల పేరు, మండలం	విద్యార్థుల సంఖ్య
ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ కళాశాల, జడ్చర్ల	300
ప్రభుత్వ బాలికల కళాశాల, జడ్చర్ల	350
ప్రభుత్వ జూనియర్ కళాశాల మిడ్జిల్	150
ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలానగర్	250
ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్మన్‌గండ్ల (నవాబుపేట)	350
మొత్తం 5 కళాశాలలు	1,300

సమస్య తీరుతుంది..



చదువు కోసం తిర్మలాపూర్ నుంచి కాలేజీకి వస్తున్నా. ఇంటి వద్ద సమయానికి వంట కాకుంటే టిఫిన్ తెచ్చుకోలేక రోజూ మధ్యాహ్న భోజనం కోసం ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. కాలేజీలోనే భోజనం పెడతారంటే మా సమస్య తీరుతుంది. రోజూ కాలేజీకి వచ్చి చదువుకునే అవకాశం కలుగుతుంది.

– నవనీత, ఎంపీసీ ప్రథమ సంవత్సరం, కో-ఎడ్యుకేషన్ కళాశాల జడ్చర్ల

300 మందికి ప్రయోజనం..



ఎమ్మెల్యే అందిస్తున్న మధ్యాహ్న భోజనంతో మా కళాశాలలో 300 మందికి ప్రయోజనం కలుగుతుంది. గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుండటంతో సమయానికి మధ్యాహ్న భోజనం తెచ్చుకోలేకపోతున్నారు. ఈ కారణంగా కొందరు ఇళ్లకు త్వరగా వెళ్లిపోతున్నారు. వారందరికీ మధ్యాహ్న భోజనం సౌకర్యంగా ఉంటుంది.

– ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్, కో- ఎడ్యుకేషన్ కళాశాల, జడ్చర్ల

ఊర్లోనే ఉన్నా.. వెళ్లిరాలేం



కాలేజీ ఊర్లోనే ఉన్నా, మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లిరాలేం. ఇంటికి కాలేజీకి 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇంటి నుంచి కొన్నిసార్లు టిఫిన్ తెచ్చుకోలేక మధ్యాహ్నం క్లాసులు వినలేక ఇంటికి వెళ్లిపోయేవాళ్లం. ప్రస్తుతం ఆ సమస్య ఉండదు.

– కిర్మాణి, బైపీసీ ద్వితీయ, కో-ఎడ్యుకేషన్ కళాశాల, జడ్చర్ల

ఉత్తమ ఫలితాలు రాబట్టాలనే..



కళాశాలలో విద్యార్థులు భోజనం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధ్యాపకులు నా దృష్టికి తీసుకురాగానే, మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నా. నా జన్మదినం అందుకు సరైన వేదికగా భావించి ఆ రోజున ప్రకటించాను. నియోజకవర్గంలోని 5 కళాశాలల్లోనూ 1300 మందికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నా. తద్వారా హాజరు శాతం పెరిగి విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు తీసుకొస్తారు. ఇదే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యేలా చూస్తా.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

బాస్కెట్‌బాల్ రాష్ట్రజట్టులో కల్వకుర్తి విద్యార్థి



రాంచంద్రారెడ్డి

కల్వకుర్తి: బాస్కెట్‌బాల్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన విద్యార్థి విశేషంగా రాణిస్తున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతూ.. ప్రస్తుతం జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం కుమారుడు రాంచంద్రారెడ్డి హైదరాబాద్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చిన్నతనం నుంచి బాస్కెట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్నాడు. తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించడంతో ఆటల్లో మెరుపులు మెరిపిస్తున్నారు. ఆడిన ప్రతి టోర్నీలోనూ సత్తా చాటుతూ ఇప్పుడు జాతీయస్థాయికి ఎదిగాడు. ఇటీవల జరిగిన వరుస మ్యాచుల్లో విశేషంగా రాణించడంతో తెలంగాణ జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌ఘర్ రాష్ట్రం రాయ్‌పూర్ సమీపంలోని రాజనందస్‌ఘావ్‌లో నిర్వహించనున్న 67వ ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీలో అండర్-14 తెలంగాణ జట్టు తరఫున బరిలో దిగనున్నాడు. జాతీయస్థాయిలో రాష్ట్ర జట్టుకు కల్వకుర్తి విద్యార్థి ఎంపిక కావడంపై స్థానిక క్రీడాభిమానులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 4న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్-14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు. మిగతా వివరాల కోసం నాగరాజు (9959220075), రాఘవేందర్ (9959016610) నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

రన్నరప్‌గా మహబూబ్‌నగర్

- ముగిసిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నీ
- బాలికల విభాగంలో జిల్లా జట్టుకు మూడోస్థానం
- చాంపియన్లుగా ఆదిలాబాద్, వరంగల్ జట్లు



బాలుర విభాగం రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు



బాలికల విభాగం మూడోస్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీ ముగిసింది. బాలుర విభాగంలో ఆతిథ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నరప్‌గా, బాలికల విభాగాల్లో జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచింది. ఆదిలాబాద్-మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. చివరకు ఆదిలాబాద్ జట్టు 20-17 గోల్స్ తేడాతో విజయం సాధించింది. బాలుర విభాగంలో మూడోస్థానంలో వరంగల్ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ 9-1 గోల్స్ తేడాతో ఆదిలాబాద్ జట్టును చిత్తు చేసి చాంపియన్‌గా నిలిచింది. ఇందులో పాలమూరు జట్టు మూడోస్థానంలో నిలిచింది.

- విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో టోర్నీలో విద్యార్థులు ఎంతో ఉత్సాంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో జరిగే టోర్నీలో మెరుగైన ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, టోర్నీ రాష్ట్ర పరిశీలకులు పుల్లయ్య, శ్రీనివాస్, గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శాంత, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమర్ ఫర్హాత్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్, కోచ్ విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు బాల్‌రాజు, అహ్మద్ హుస్సేన్, రాంమోహన్‌గౌడ్, ప్రదీప్, నర్సింహ, అర్చన, రాధిక, గణేశ్వరి పాల్గొన్నారు.